## బొగ్గు బ్లాకులపై సర్వహక్కులూ తెలంగాణవే

- వేలం వేసి ఇతర సంస్థలకు కేటాయిస్తే ఊరుకోం
- రాష్ట్ర వ్యాప్తంగా అగ్గి రాజేస్తం
- టీబీజీకేఎస్ కేంద్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి

మందమర్రి, జూన్ 25 : నూతన బొగ్గు బ్లాకులపై సర్వహక్కులూ తెలంగాణ ప్రజలవేనని, వేలం వేసి ఇతర సంస్థలకు కేటాయించాలని చూస్తే ఊరుకునేది లేదని తెలంగాణ, రాష్ట్ర వ్యాప్తంగా అగ్గి రాజేస్తామని బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం నిర్వహించకుండా సింగరేణికే కేటాయిస్తామని హామీలు ఇచ్చాయన్నారు. ఎన్నికలోల కార్మికుల ఓట్లతో గెలిచిన అనంతరం గతంలో గుర్తించిన బొగ్గు గనులను ఆయా పార్టీలు వాగ్దానాలను విస్మరించి, ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. నూతన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించేలా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులు ఢిల్లీకి వెళ్లి, ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. నూతన గనులు ఇతర ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తే సింగరేణి మనుగడ దెబ్బతింటుందని, ఈ ప్రాంత నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నూతన గనుల వేలం పాట రద్దు చేసి, ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలని సూచించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సింగరేణి ప్రాధాన్యతను కేంద్రానికి వివరించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, కార్మికులకు 35 శాతం వాటాను వచ్చే నెల వేతనాలతో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు సింగరేణి సంస్థ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించి పరీక్షలు నిర్వహించలేదని, ఎన్నికల కోడ్ సాకుతో వాయిదా వేసిందని ఆరోపించారు. పరీక్షల అనంతరం ఓఎంఆర్ షీట్లను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్, పట్టణాధ్యక్షుడు జే రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ నాయకులు బడికెల సంపత్ కుమార్, ఓ రాజశేఖర్, నాయకులు అందె శ్రీకాంత్, సారంగపాణి తదితరులున్నారు.

## అంగన్‌వాడీల ద్వారా పిల్లల సంరక్షణకు చర్యలు

- రాష్ట్ర మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ
- అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 25 : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి శాఖ ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సంబంధిత అధికారులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య, టీచర్లకు శిక్షణ, పిల్లల బరువు వ్యత్యాసం, ట్రాన్స్ జెండర్లకు ధ్రువీకరణ పత్రాల జారీ, పిల్లల దత్తత, వయోవృద్ధుల పోషణలో పిల్లల నిర్లక్ష్యం-తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు ఆరోగ్య సంరక్షణపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి హాజరయ్యారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు, పోషకాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళలకు ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు కృషి**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి, లక్ష్యాన్ని చేరుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో గ్రామ సంఘాల నిర్వాహకులు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లతో మహిళా శక్తి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టేపనిని వారికే అప్పగించిందని తెలిపారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంట్రప్రెన్యూర్స్, కుట్టుకేంద్రాలు, పాడి పశువులు, సంచార మత్స్య విక్రయ ఔట్లెట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళా క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్స్ వంటి 15 రకాల కార్యకలాపాలు చేపట్టేందుకు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లాలో గల మహిళా సంఘాలకు 78 మీసేవా కేంద్రాలు నెలకొల్పడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. ఔత్సాహిక మహిళా సంఘాలను చేపల పెంపకం వైపు ప్రోత్సహించాలన్నారు. ఆయా మండలాల్లో అవసరమైన మహిళా శక్తి యూనిట్లను గుర్తించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. వ్యవసాయ యంత్రాలను అద్దెకివ్వడం ద్వారా మరింత ఆదాయం పొందవచ్చునన్నారు. మిగిలిన మండలాల్లో వ్యవసాయ యంత్రాల యూనిట్లను ప్రారంభించాలన్నారు. ఇందుకోసం మహిళలు బ్యాంకు రుణాలను, స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో రామకృష్ణ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**మెరుగైన వైద్య సేవలందించాలి**

మెరుగైన వైద్య సేవలందించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ సందర్శించారు. ఈనెల 24న ఆసుపత్రిలో సిజేరియన్ ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చిన ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన లోబాడే శోభాను అభినందించి పండ్లు అందించారు. ఈ శస్త్ర చికిత్స జరిపిన వైద్యులు, సిబ్బందిని అభినందించి పలు సూచనలు చేశారు. జిల్లా దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్లోని వసతులపై సూపరింటెండెంట్‌ని అడిగి తెలుసుకుని పలు సూచనలు, సలహాలు చేశారు. వర్షాకాలం కావడంతో దవాఖానను శుభ్రంగా ఉంచాలన్నారు.

**నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి**

జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొడిసెల కార్తీక్, దుర్గం దినకర్ , రాజేందర్, నిఖిల్, శ్రీకాంత్, తిరుపతి తదితరులు ఉన్నారు.

## పరీక్షా పత్రాలు తెలుగు, ఇంగ్లిష్‌లో ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూన్ 25 : సింగరేణిలో అంతర్గత నియామకాల పరీక్షా ప్రశ్న పత్రాలు తెలుగుతో పాటు ఇంగ్లిష్‌లో ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాన్ని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో నూతనంగా 16 వేల మంది యువ కార్మికులు, ఉన్నత చదువులు, ఆంగ్లమాధ్యమంలో చదువుకున్నవారే ఉన్నారని తెలిపారు. సింగరేణిలో అంతర్గత ఖాళీల భర్తీకి నిర్వహించే నియామక పరీక్షా పత్రాన్ని తెలుగుతో పాటు ఇంగ్లిష్‌లో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులు పరీక్షలు రాసిన తర్వాత యాజమాన్యం ప్రశ్నాపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓఎంఆర్ షీట్ వెబ్‌సైట్‌లో పెట్టాలని కోరారు. ఈ మేరకు తమ యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సీఎండీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వెంటనే టీబీజీకేఎస్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, మాజీ కార్యదర్శి పానగంటి సత్తయ్య, కేంద్ర కమిటీ నాయకులు పొగాకు రమేశ్, గొర్ల సంతోష్, మహిపాల్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

## రెస్క్యూ సేవలు అనిర్వచనీయం

**- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి**



రెస్క్యూ జీఎంను సన్మానిస్తున్న శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి

సీసీసీ నస్పూర్, జూన్ 25 : సింగరేణి గనుల పని స్థలాల విస్తరణలో రెస్క్యూ సేవలు అనిర్వచనీయమని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ నెలలో విరమణ పొందనున్న రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లును మంగళవారం జీఎం సంజీవరెడ్డితో పాటు పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రెస్క్యూ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఇందారం ఓసీపీ పీవో శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో శ్రీనివాస్, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, అధికారులు రామ్మోహన్, సంపత్, జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ఉద్యోగం అదృష్టంగా భావించాలి

శ్రీరాంపూర్, జూన్ 25 : సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలని, ఉన్న ఉద్యోగాన్ని పోగొట్టుకోకుండా విధులకు హాజరవ్వాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలో మంగళవారం ఆర్కే-5, 6 గనుల గైర్హాజరు కార్మికులకు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, జీఎం కౌన్సెలింగ్ నిర్వహించారు. 5 రోజులగా 433 మంది గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎం అరవిందరావు, చిరంజీవులు, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, డీవైపీఎంలు రాజేశ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

## ఉన్నత చదువుల్లో ప్రోత్సహించేందుకే మెరిట్ స్కాలర్‌షిప్

**- మందమర్రి జీఎం మనోహర్**

మందమర్రి, జూన్ 25 : ఉద్యోగుల కుటుంబాల విద్యార్థులను ఉన్నత చదువుల్లో ప్రోత్సహించేందుకే సింగరేణి సంస్థ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తున్నదని మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్ అన్నారు. జీఎం కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఐదో సంవత్సరం చదువుతున్న ఏరియాలోని కేకే-5 గని కార్యాలయ సూపరింటెండెంట్ సముద్రాల బుచ్చయ్య కొడుకు సాకేత్.., ఆర్కేఓసీ ఈపీ ఆపరేటర్ దుంపేటి శంకర్ బిడ్డ అనితకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరైనట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను బుచ్చయ్య, శంకర్‌కు అందజేశారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్‌అలీ, సీఎంవోఏఐ అధ్యక్షుడు పైడీశ్వర్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఓఎస్ రాజలింగు తదితరులున్నారు.

**క్రీడాకారులకు సన్మానం..**

కోలిండియా పోటీల్లో (బాడీ బిల్డింగ్, హాకీ) ప్రథమ బహుమతులు సాధించిన మందమర్రి ఏరియా క్రీడాకారులు బీ వెంకటస్వామి, ఎస్ క్రాంతికిరణ్‌ను జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులు, యూనియన్ నాయకులతో కలిసి జీఎం మనోహర్ సన్మానించారు. చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీలు సలేంద్ర సత్యనారాయణ, అక్బర్‌అలీ, సీఎంవోఏఐ అధ్యక్షుడు పైడీశ్వర్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి ఎం కార్తీక్, క్రీడల సమన్వయ కర్త రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై కొబ్బరి మొక్కలను సద్వినియోగం చేసుకోండి

పెంచికల్ పేట్, జూన్ 25 ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వస్తున్న కొబ్బరి మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీ డీడీ కుమారవేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని మొట్టమొదటి కొబ్బరి మొక్కల సాగు, సబ్సిడీపై రైతులకు అవగాహన సదస్సును అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి సాంద్రత గల ప్రాంతాల్లో కొబ్బరి సాగు అనుకూలమని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రాణహిత, పెద్దవాగు జీవనదుల ఉన్నందున ఈ ప్రాంతం కొబ్బరి సాగుకు అనుకూలంగా ఉంటుందని ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు డాక్టర్ మురళి, డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ కొబ్బరి, ఆయిల్ పంప్ సాగు విధానం, అంతర కృషి, అంతర్ పంటలు, నీరు, ఎరువుల వాడకం, చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఉట్నూర్ పీవో సందీప్ కుమార్, ఏడీఏ రాజునాయుడు, ఉద్యాన శాఖ అధికారులు శాంతిప్రియ, సుధీర్ కుమార్ సీడీబీ అధికారులు కిరణ్, సురేశ్ ఐటీడీఏ సిబ్బంది రమేశ్, జయరాజు చందర్ ఏఈవోలు శ్రీవిద్య, శ్రీధర్, రవితేజ, మండల కో ఆప్షన్ సాజిత్, ఎంపీటీసీ రాజన్న, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు కొబ్బరి మొక్కలు అందజేస్తున్న అధికారులు

## సమస్యల పరిష్కారానికి కృషి

సీసీసీ నస్పూర్, జూన్ 25 : సింగరేణి మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య హామీ ఇచ్చారు. సీసీసీ నస్పూర్ నర్సయ్య భవన్‌లో మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బదావత్ బాలకృష్ణ, ఏరియా కార్యదర్శిగా మారేపల్లి బాబు, సహాయ కార్యదర్శిగా ఉప్పరి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా రాజశేఖర్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డోంగిరి రోమాజీ, ఇందారం గ్రూప్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మహ్మద్ గౌసొద్దీన్, ఆరే-7, శ్రీరాంపూర్ గ్రూపుల ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మూల పవన్‌కుమార్, రావి రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు తదితరులున్నారు.


